క్లుప్తంగా

ముమ్మరంగా బడిబాట

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారం సెక్టార్ సూపర్‌వైజర్ సరోజిని ఆధ్వర్యంలో బుధవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కూనవరం గ్రామ పంచాయతీలోని వైఎస్సార్ నగర్ అంగన్‌వాడీ టీచర్ నాగమణి, న్యూ పద్మగూడెం అంగన్‌వాడీ టీచర్ వాణీ, రామానుజవరం సెక్టార్‌లోని సాంబాయిగూడెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. పిల్లలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉండే విధంగా పర్యవేక్షిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే టీం, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మహిళకు వైద్య సాయం

దమ్మపేట: మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన జొన్నకూటి లక్ష్మి అను మహిళ అనారోగ్యంతో బాధపడుతుండగా.. ఆమెకు సరైన వైద్య సహాయం అందేలా, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం తగు ఏర్పాట్లను చేశారు. లచ్చాపురం గ్రామానికి చెందిన జొన్నకూటి లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆమెను గండుగులపల్లిలోని క్యాంప్ కార్యాలయానికి పిలిపించి, అనారోగ్య సమస్యను తెలుసుకున్నారు. సంబంధిత డాక్టర్‌తో ఫోన్లో మాట్లాడి, మెరుగైన వైద్య సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు. ఆపై ఆమెను ఆస్పత్రికి వెళ్లమని సూచించారు.

విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనలో భాగంగా ఏపీజీవీబీకి వచ్చారు. ఈ సందర్భంగా వారికి బ్యాంక్ పనితీరు, వ్యవసాయ, ఇతరత్రా రుణాల మంజూరు విధానం, ఆదాయ వ్యయాలను బ్యాంక్ మేనేజర్ మణికంఠ వివరించారు. కళాశాల ప్రొఫెసర్ కృష్ణతేజ, బ్యాంక్ ఉద్యోగులు సృజనలక్ష్మి, విశ్వేశ్వరరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిర్రాజు జాతర

చర్లరూరల్: ఇరప వంశం వారి ఇలవేల్పు శిర్రాజు, బాలరాజుల జాతర కొయ్యూరు గ్రామంలో నిర్వహించారు. నాలుగు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజు బుధవారం భక్తులు శక్తులను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని, కానుకలను సమర్పించుకున్నారు. అనంతరం ఇలవేల్పు శక్తులను వనప్రవేశం గుహకు పంపడంతో జాతర ముగిసింది.

9న ట్రైబల్ ఫోరం సదస్సు

బూర్గంపాడు: ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 9న కొత్తగూడెంలో జరగనున్న ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆ సంస్థ జాతీయ నాయకుడు సువర్ణపాక నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని రాజీవ్‌నగర్, ఏడుళ్లచెరువు గ్రామాలలో బుధవారం సదస్సును విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఖనిజ సంపదను దోచుకునేందుకు అటవీ సంరక్షణ పేరుతో కొత్త చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో కుంజా భద్రు, గణేష్, లక్ష్మ,భీమా, ఇడమయ్య, గౌతం, సమ్మయ్య, లక్ష్మి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ మార్చాలి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని అంబేద్కర్‌నగర్‌లో ఇళ్లపై నుంచి వెళ్తున్న త్రీఫేస్ విద్యుత్ లైన్‌ను మార్చాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సబ్‌స్టేషన్ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందించారు. సమస్య తీవ్రతను అనేకమార్లు విద్యుత్ శాఖాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సత్వరమే స్పందించని పక్షంలో సబ్‌స్టేషన్ ముట్టడిస్తామని సీపీఎం నాయకుడు మిరియాల మోహన్‌రావు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రాయి రాజా, అబ్దుల్ రహిమాన్, కాకటి నగేష్, కుక్కముడి లక్ష్మీనారాయణ, పున్నం, యశోద పాల్గొన్నారు.

మెజార్టీపై హర్షం

అశ్వారావుపేటరూరల్: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిను అత్యధిక మెజార్టీతో విజయాన్ని అందించడం పట్ల అశ్వారావుపేట మండల కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎంపీకి ఓట్లు వేసి ఆదరించిన ఓటర్లకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు, మిత్రపక్ష పార్టీల బాధ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు ఎస్కే పాషా, మాజీ సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, దాసరి రవి, దేవరాజు, ఎస్.బాలగంగాధర్, శోభన్, కృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి

అశ్వాపురం: ప్రైవేటు విద్యా సంస్థలు లక్షల రూపాయల ఫీజులతో విద్యా వ్యాపారం చేస్తున్నారని, దీనిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి సాయి డిమాండ్ చేశారు. అశ్వాపురంలో బుధవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ, మండల. పట్టణ కేంద్రాల్లో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేసి ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పలువురు అటవీశాఖ అధికారులు, జడ్జిలు, నాయకులు ఆయా చోట్ల విభిన్న రకాల మొక్కలు నాటారు. ప్లాస్టిక్, చెత్తాచెదారాలను తొలగించారు. పర్యావరణ ర్యాలీలు తీశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. మానవాళి మనుగడ, కాలుష్య నివారణ కోసం ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా వక్తలు గుర్తు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



మణుగూరురూరల్: మొక్క నాటుతున్న ఎఫ్‌డీఓ మక్సూద్ మొహియుద్దీన్, అటవీ అధికారులు



మణుగూరురూరల్: కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి



భద్రాచలంఅర్బన్: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి వెంకటేశ్వర్లు



బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో మొక్కలు నాటుతున్న అధికారులు, కార్మికులు



అశ్వారావుపేటరూరల్: ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది



మణుగూరుటౌన్: పర్యావరణ ఆవశ్యకతపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సింగరేణి అధికారులు



భద్రాచలంటౌన్: విద్యుత్ శాఖ ఉద్యోగులు..



దమ్మపేట: నాటిన మొక్కకు నీరు పోస్తున్న ఎంపీడీఓ రవీంద్రనాథ్ రెడ్డి



అశ్వాపురం: మొక్కలు నాటే కార్యక్రమంలో మణుగూరు ఫారెస్ట్ అధికారులు



చంద్రుగొండ: మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ అశోక్

నీట్‌లో విద్యార్థుల సత్తా



పావని



హర్షిత

చర్లరూరల్/దుమ్ముగూడెం: చర్ల మండలం పెద మిడిసిలేరుకు చెందిన బెండబోయిన పావని నీట్‌లో 720 మార్కులకు 524 మార్కులు సాధించింది. ఐదో తరగతి వరకు చర్లలో, ఆరో తరగతి నుండి భద్రాచలం నవోదయలో చదివిన పావని తండ్రి మురళీకృష్ణ చర్ల మండలంలోని రామానుజపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక దుమ్ముగూడెం మండలం చిన్నఆర్లగూడెంకు చెందిన ఆదివాసీ విద్యార్థిని పెనుబల్లి హర్షిత నీట్‌లో 466 మార్కులతో జాతీయ స్థాయి 4,504 ర్యాంకు సాధించింది. పెనుబల్లి శంకర్ – కమల దంపతుల కుమార్తె హర్షిత 10వ తరగతి ఖమ్మం గురుకులంలో, ఇంటర్‌ను వరంగల్‌లోని సీఓఈలో పూర్తిచేసింది. ఆమెను గ్రామస్తులు పలువురు అభినందించారు.

'లిటిల్ ఫ్లవర్స్' ప్రతిభ



భద్రాచలంటౌన్: ర్యాంకులు సాధించిన విద్యార్థులతో లిటిల్ ఫ్లవర్స్ డైరెక్టర్లు, అధ్యాపకులు


భద్రాచలంటౌన్: భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు నీట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. 720 మార్కులకు గాను బి.శర్వాణి పావని 538, బి.మేఘన 495, ఎస్.మేఘన 465 మార్కులు సాధించగా, మణిదీప్ నూర్జహాన్, సమహార, భాను శ్రీ, నిశాంత్ తదితర విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని డైరెక్టర్లు మాగంటి ప్రసాద్ బాబు, రమేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం వారు విద్యార్థులను అభినందించాక మాట్లాడుతూ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడమే కాక ఎంసెట్, నీట్ లోనూ తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయం

మణుగూరుటౌన్: సింగరేణి కార్మిక నాయకులు హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అమరుడు కొడిపెల్లి శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని ఇన్‌చార్జ్ జీఎం తాళ్లపలి లక్ష్మీపతిగౌడ్ అన్నారు. బుధవారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కమ్యూనిటీహాల్‌లో తృతీయ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా ఆయన హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్‌తో కలిసి హాజరై మాట్లాడారు.

కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల చురుకైన పాత్రను పోషించడమే కాకుండా రెండో దశ తెలంగాణ ఉద్యమంలో అంబేడ్కర్ ఆశయ సాధనకు నిగా కూడా తన వంతు కర్తవ్యంగా మణుగూరు ఏరియాలో నిర్వహించి పలు కార్యక్రమాల్లో కొడిపెల్లి సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఖమ్మం తలసేమియా సికిల్ సెల్ సొసైటీ వారికి అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్యాంసుందర్, సురేశ్‌కుమార్, నర్సింహారావు, దావులూరి శ్రీనివాస్, ఇన్నయ్య, సీనియర్ పీవో మదార్ సాహెబ్, రమేశ్, ఏఐటీయూసీ నాయకులు వై.రాంగోపాల్, మేకల ఈశ్వర్, ఐఎన్టీయూసీ నాయకులు కృష్ణంరాజు, సీఐటీయూ నాయకులు వెంకటరత్నం, ఇఫ్టూ నాయకులు నాసర్‌పాషా, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువా కవిత్వానుశీలనం



గుర్రం జాషువా కవిత్వానుశీలనంలో మాట్లాడుతున్న వక్త

చర్లరూరల్: కవి కోకిల గుర్రం జాషువా కవిత్వానుశీలనం బుధవారం చర్ల రైసుపేటలోని శైలజా విహార్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. దివంగత ప్రముఖ రంగస్థల నటుడు, రాజకీయ సామాజిక వేత్త సీవీకే రావు 96వ జయంతి సందర్భంగా ప్రముఖ కవులు ఎస్ సీహెచ్ చక్రవర్తి, పాలపర్తి హవీలా, నిభానుపూడి సుబ్బరాజు, మండవ సుబ్బారావులు తొలుత సివికె రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుర్రం జాషువా రచనలను కొన్నింటిని తమదైన శైలిలో వివరించారు. ఏజెన్సీ ప్రాంతమైన చర్లలో ఉంటూ సీవీకే రావు నాటక రంగానికి ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు.రాష్ట్ర, జాతీయ స్థాయిలో నాటకాలను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ నటుడు, దర్శకుడు డీయస్యన్ మూర్తికి సీవీకే రావు స్మారక రాష్ట్రస్థాయి రంగస్థల పురస్కారాన్ని సీవీ రమణ ప్రదానం చేశారు.అనంతరం మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ వారిచేత చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలకు ఎదురుచూపులు

- తొలిదఫాలో సగానికి లోపే సరఫరా
- తీవ్ర నిరాశలో రైతులు



రైతువేదిక ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

చంద్రుగొండ: పచ్చి రొట్ట విత్తనాల కోసం మండల రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. మండలానికి 350 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు (పచ్చిరొట్ట) అవసరం ఉండగా ఈ మేరకు మండల వ్యవసాయ శాఖాధికారులు డిమాండ్ పెట్టారు. అయితే తొలివిడతగా 124 క్వింటాళ్లు మాత్రమే సరఫరా అయ్యాయి. అరకొరగా వచ్చిన విత్తనాలు ఒక్కరోజులోనే అయిపోయాయి. ఈ క్రమంలో రెండోదఫా వచ్చే విత్తనాల కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూశారు. తాజాగా నాలుగు రోజుల క్రితం రెండో దఫా 100 క్వింటాళ్ల విత్తనాలను తెలంగాణ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ పంపించింది. అయితే సదరు విత్తనాలు మొలక శాతం తక్కువగా ఉందని నిర్ధారణ అయింది. దీంతో రైతులు తీవ్ర నిరాశపడ్డారు. పంటపొలాల్లో విధిగా పచ్చిరొట్ట పెంచాలని రైతులకు సూచిస్తున్న వ్యవసాయశాఖ ఆ మేరకు విత్తనాలు పంపిణీ చేయడంలో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే కాలం పోయిందని, వర్షాలు ప్రారంభమైతే విత్తనాలు వేసే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖాధికారి వినయ్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. అవసరం మేరకు తాము విత్తనాల కోసం తాము డిమాండ్ పెట్టామన్నారు. మరో రెండు రోజుల్లో నాణ్యమైన విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

రైతువేదిక ఎదుట ధర్నా

జీలుగు విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు బుధవారం రైతువేదిక ఎదుట ధర్నా చేశారు. విత్తనాల కోసం తాము రోజుల తరబడి తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సత్వరమే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

ఉచిత విద్యకు దరఖాస్తులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎమిలీ పాఠశాలలో ఉచిత విద్య కోసం దరఖాస్తులు చేసుకోవాలని, పరిమితమైన సీట్లు ఉన్నందున తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు లేని, లేదా తల్లిదండ్రుల్లో ఎవరైనా లేని పిల్లలు మండలంలో ఎక్కడి నుంచైనా తమ పాఠశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు అన్నింటినీ పరిశీలించి అందరికీ పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు 1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఉచితంగా విద్య అందిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు కేవలం పుస్తకాలు, యూనిఫామ్ మాత్రమే బయట తీసుకోవాలని, విద్యను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంలు మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన మీసేవ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని వివరాలకు 9912467858, 9182202087 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీ చేయాలి

దమ్మపేట: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రం, దమ్మపేట గ్రామంలో ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ... రైతులకు ఏకకాలంలో రుణమాఫీతో పాటుగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీపై అందజేయాలని డిమాండ్ చేశారు. పంటలకు బీమాను వర్తింపజేసి, వరికి 500 రూపాయల బోనస్‌ను వెంటనే ఇవ్వాలని అన్నారు. నాయకులుపండూరి వీరబాబు, కుంజా కాంతారావు, తాటి వెంకటేశ్వరరావు, కుర్సం ముత్యాలరావు, బండి ఆదినారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అశ్వాపురం: గత నెల 27న మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మండల పరిధిలోని పాయం మంగయ్య గుంపు గ్రామానికి చెందిన ఆలం రాజు(36) బుధవారం మృతి చెందాడు. మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్న మెదడుకు గాయమై తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి అక్కడి నుంచి హన్మకొండలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నిరుపేద కుటుంబం కావడంతో అప్పు చేసి వైద్యం అందించి ఆర్థిక స్థోమత లేక ఈ నెల 2న భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 3న ఆదుకోండి అను శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. తమ మిత్రుడు రాజు కు ఎలాగైన మెరుగైన వైద్యం అందించాలని తోటి స్నేహితులు తమకు తోచిన విధంగా సహాయం చేసి దాతలను ఆశ్రయించి సహాయం చేయించారు. తన స్నేహితులు, గ్రామస్తులు, దాతలు ఆర్థిక సహాయం చేశారు. డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య చొరవతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆస్పత్రిలో ఈ నెల 3న చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు మృతదేహానికి స్థానికులు, స్నేహితులు నివాళులు అర్పించారు.

'ఉపాధి హామీ' పరిరక్షణకు ఉద్యమించాలి

బూర్గంపాడు: ఉపాధి హామీ పథకం పరిరక్షణకు అందరు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తాళ్లగొమ్మూరులోని ఉపాధిహామీ పని ప్రాంతాలలో బుధవారం ఆయన పర్యటించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పరిరక్షణ కోసం జూన్ 10న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి సదస్సు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాధవి, తిరుపతమ్మ, గోపాలరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

గుండాల: అత్యవసర వైద్యం పొందుతున్న ఓ వ్యక్తికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించారు. ఆళ్లపల్లి గ్రామానికి చెందిన రేసు మల్లిఖార్జున్ డిగ్రీ చదువుతున్నాడు. కాగా ఇటీవల కాలంలో కాళ్ల చచ్చుపడిపోవడంతో హైదరాబాద్ ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నాడు. కాగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆపరేషన్ చేయించాలని సూచించారు. ఆపరేషన్ ఖర్చు సుమారు 5 లక్షలు అవుతుందని తెలిపారు. దీంతో నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. విషయం చెప్పడంతో అత్యవసర వైద్యం నిమిత్తం రూ.2లక్షల 50వేల విలువైన ఎల్‌ఓసీని అందించారు.

నిబంధనలకు పాతర

- అడ్డగోలుగా స్క్రాప్ దుకాణాల ఏర్పాటు
- ఇష్టారాజ్యంగా నిర్వహణ
- అనుమతులు ఉన్నవి కొన్నే..
- ప్రమాదాలకు ఆస్కారం



ఐటీడీఏ ఎదురుగా నిర్వహిస్తున్న ఓ స్క్రాప్ దుకాణం

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో స్క్రాప్ దుకాణాలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. లక్షలు కురిపించే వ్యాపారం కావడంతో చాలా మంది దృష్టి ఈ వ్యాపారంపైకి మళ్లింది. అయితే అనుమతి లేకుండా.. నిబంధనలు పట్టకుండా పట్టణంలో చాలా చోట్ల ఈ వ్యాపారాలు సాగుతున్నాయి. తొలుత జీవనోపాధికి పెట్టుకున్న ఈ షాపులు.. క్రమేపీ వ్యాపార సామ్రాజ్యంగా విస్తరిస్తున్నాయి.

భద్రాచలం పట్టణంతో పాటు సారపాకతో కలిపి మొత్తం 12 స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. నిత్యం ఇవి పాత సామాన్లతో కిటకిటలాడుతుంటాయి. సాధారణంగా స్థానిక సంస్థల అనుమతితోనే స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేయాలి. పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా ఆ శాఖ అనుమతి తీసుకోవాలి. ఇది జరగడం లేదు. స్క్రాప్ కొనుగోలు, విక్రయాలు బిల్లు చెల్లింపుల ద్వారా జరగాలి. కానీ లారీలకు లారీలు లోడ్లతో స్క్రాప్ తరలుతున్నా ఎటువంటి పన్నులు చెల్లించడం లేదన్న ఆరోపణలున్నాయి. తప్పుడు వే బిల్లుతో తరలిస్తున్నట్టు సమాచారం. స్క్రాప్ దుకాణాల వల్లే ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరుగుతాయనే ఆరోపణలున్నాయి. అందుకే ఊరికి దూరంగా నిర్వహించుకోవాలన్న స్పష్టమైన నిబంధన ఉంది. ఇది అమలవుతున్న దాఖలాలు లేవు. దీనికితోడు స్క్రాప్‌మాటున భారీగా శ్రమదోపిడీ జరుగుతోంది. నిరుపేదలకు ఆశచూపి వారి నుంచి వస్తువులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆపై వారు ఎక్కువకు విక్రయించుకుంటున్నారు.

'ప్రభుత్వ' వస్తువులు స్క్రాప్‌లో..

ప్రభుత్వరంగ సంస్థలు వినియోగించే వస్తువులు కొనడం, అమ్మడం నేరం. కానీ ప్రతిస్క్రాప్ దుకాణంలో అవే సామాన్లు కనిపిస్తున్నాయి. ఆక్సిజన్ సిలిండర్లు ప్రతిచోటా ఉంటున్నాయి. అయితే స్క్రాప్ దుకాణాలపై సమీప నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరమైన వస్తువులతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు.

దొంగతనాలకు పరోక్ష ప్రోత్సాహం

స్క్రాప్ దుకాణాలపై నిఘా లేకపోవడంతో దొంగతనాలకు కూడా కారణమవుతున్నాయి. విద్యుత్ శాఖకు సంబంధించి పాత ఇనుప స్తంభాలు, కాలం చెల్లిన ట్రాన్స్‌ఫార్మర్లను, అదే విధంగా ప్రస్తుతం వినియోగంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి కాపర్ వైర్‌ను దొంగిలించి ఇక్కడే విక్రయిస్తున్నారు. గతంలో చాలా కేసులకు సంబంధించి మూలాలు స్క్రాప్ దుకాణంలో బయటపడడం విశేషం.


పీసీబీ అధికారుల దృష్టి పడకుండా..

పరిశ్రమలు వినియోగించి పారేసే రసాయన డ్రమ్ములు, పాలిథీన్ వ్యర్థాలు, కాగితాలు, థర్మకోల్ షీట్లు, ఒక్కోసారి ఘన వ్యర్థాలు కూడా తుక్కు దుకాణాల్లో దర్శనమిస్తున్నాయి. పరిశ్రమల తుక్కును నిబంధనల మేరకు తరలించాల్సి ఉండగా.. ఇవేమీ పట్టించుకోకుండా గల్లీల్లోని దుకాణాలకు విక్రయిస్తున్నారు. పీసీబీ అధికారుల దృష్టి పడకుండా జాగ్రత్త పడుతున్నారు. దీనికి తోడు జిల్లాలో ఉన్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు తనిఖీలు చేసే పరిస్థితి కూడా లేదు.

ఎవరి వాటా వారికి..

భద్రాచలం, సారపాకలో నడిచే స్క్రాప్ దుకాణాల నిర్వహకుల వద్ద నుంచి కొన్ని శాఖల అధికారులు మాములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఎందుకంటే ఈ దుకాణాల నిర్వహణకు కావాల్సిన, తీసుకోవాల్సిన అనుమతలు లేకుండానే ఈ వ్యాపారం ఎలా సాగుతున్నాయే అని పట్టణంలో గుసుగుసలు వినిపిస్తున్నాయి.


దుకాణాలను పరిశీలిస్తాం..



భద్రాచలంలో ఉన్న అన్ని స్క్రాప్ దుకాణాలను పరిశీలిస్తాం. వాటి ఏర్పాటుకు కావాల్సిన అన్ని లైసెన్స్‌లు ఉన్నాయా లేదా అనే వాటిపై విచారణ చేస్తాం. నిబంధనలు అతిక్రమించినట్లయితే కేసులు నమోదు చేసేలా చర్యలు చేపడతాం. రహదారికి ఆనుకొని దుకాణాలు ఉంటే తొలగించేలా చూస్తాం. ప్రజల నుంచి ఫిర్యాదు వస్తే దుకాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

– చెరుకుమల్ల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ అధికారి, భద్రాచలం

సమాచారం ఇవ్వాలి



ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే కాపర్ వైర్లు చోరీకి గురవుతూ ఉంటాయి. ఇలాంటివి అధిక శాతం దొంగతనాల రూపంలో జరిగి వీటిని స్క్రాప్ దుకాణాలలో అమ్ముతారు. ఒక వేళ ఇలాంటివి అమ్మకానికి వస్తే స్థానికంగా ఉండే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించండి. ఇతర ప్రాంతాల్లో చోరీకి గురైన విద్యుత్ పరికరాలను స్క్రాప్ దుకాణాలలోనే అమ్ముతారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

– వేణు, ఏడీఈ, విద్యుత్ శాఖ, భద్రాచలం